క్లుప్తంగా

రేపు చలో ఒంగోలు



పర్చూరు (చినగంజాం): ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా ఈ నెల 14వ తేదీ మాల ఉద్యోగుల సంఘం ఉమ్మడి ప్రకాశం జిల్లా ఆధ్వర్యంలో హలో మాల, చలో ఒంగోలు కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు ప్రముఖ న్యాయవాది కాటుకూరి బాబురావు తెలిపారు. గురువారం దానికి సంబంధించిన పత్రికను ఆయన పర్చూరులో పంపిణీ చేశారు. ఒంగోలులోని అంబేడ్కర్ భవన్‌లో ఉదయం 10 గంటలకు బహిరంగ సదస్సు జరుగుతుందని ఆయన తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఐపీఎస్ పీవీ సునీల్ కుమార్, మాజీ న్యాయమూర్తి జడ శ్రావణ్‌కుమార్, మాలమహానాడు వ్యవస్థాపకుడు మల్లెల వెంకట్రావు, స్కాలర్ మంచా మల్లేశ్వరి తదితరులు పాల్గొననున్నట్లు తెలిపారు. అంబేడ్కర్ అభిమానులు అందరూ సదస్సులో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎం రవికుమార్, పీ వివేకానంద, ఎస్ లక్ష్మీనారాయణ, కే జనార్దన్, ఎస్ హరి తదితరులు పాల్గొన్నారు.

వెల్ఫేర్ సహాయకులకు శానిటేషన్ బాధ్యతలు



వెల్ఫేర్ అసిస్టెంట్‌లతో మాట్లాడుతున్న ఎంపీడీఓ

పర్చూరు (చినగంజాం): మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లోని శానిటేషన్ పర్యవేక్షణ బాధ్యతలను గ్రామ వెల్ఫేర్ సహాయకులు చూడాలని పర్చూరు ఎంపీడీఓ ప్రద్యుమ్నకుమార్ ఆదేశించారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఆయన వెల్ఫేర్ ఇంజినీరింగ్ సహాయకులతో సమావేశం అయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వెల్ఫేర్ సహాయకులు ప్రతి సోమ, గురువారాల్లో స్వయంగా పాఠశాలలకు వెళ్లి టాయిలెట్స్, వాష్ బేసిన్, ఫ్లోర్‌లను పర్యవేక్షించి సంబంధిత యాప్‌లో ఫోటోలు అప్‌లోడ్ చేయాలని కోరారు. ఫోటోలు, అప్‌లోడ్ చేసే విధానంపై వారికి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

యువకుడు ఆత్మహత్యపై కేసు నమోదు

అద్దంకి రూరల్: లోన్ యాప్‌ల వేధింపులకు తాళలేక యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. అద్దంకి పట్టణంలోని చిలకావారి వీధిలో బుధవారం ఓ యువకుడు ఉరివేసుకుని బలవర్మరణం చెందిన ఘటన పాఠకులకు విదితమే. గురువారం మృతుడి తండ్రి పులిజెండ్ల నరసింహారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై ఖాదర్ బాషా కేసు నమోదు చేశారు. ఎస్సై వివరాల మేరకు.. పులిజెండ్ల లక్ష్మీనారాయణ అలియాస్ నాని (26) అద్దంకిలోని చిలకావారి వీధిలో రూమ్‌లో ఒక్కడే నివాసం ఉంటున్నాడు. తండ్రి నరసింహారావు విజయవాడలోని కృష్ణలంకలో టీస్టాల్ నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. తనకు ఉన్నంతలో మృతుడు లక్ష్మీనారాయణకు కొంత డబ్బు పంపిస్తుంటాడు. ఈక్రమంలో తండ్రి పంపే డబ్బులు చాలక లోన్ యాప్ ద్వారా లోన్ తీసుకున్నాడు. యాప్ ద్వారా తీసుకును డబ్బు ఇవ్వాలని తరచూ ఒత్తిడి రావటంతో ఇంట్లోని ఫ్యాన్‌కు ఉరి వేసుకుని మృతి చెందాడు. తన స్నేహితుడు ఇంటికివచ్చి పిలిచినా ఎంతసేపటికి స్పందించకలేదు. ఇంటి యజమానిని పిలుచుకువచ్చి తలుపులు గట్టిగా నెట్టి చూడగా మృతి చెందాడు. ఈమేరకు ఎస్సై కేసు మోదు చేశారు.

భవిత కేంద్రం ఆకస్మిక తనిఖీ



భవిత కేంద్రాన్ని పరిశీలించి చిన్నారులతో మాట్లాడుతున్న జిల్లా కోఆర్డినేటర్

బల్లికురవ (అద్దంకి రూరల్): బల్లికురవ భవిత కేంద్రాన్ని జిల్లా ఐఈ కో ఆర్డినేటర్ ఎం జోత్స్న గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. దీనిలో భాగంగా రికార్డులను పరిశీలించారు. ఈనెల 29వ తేదీన బాపట్లలో గ్రహణమొర్రి, గ్రహణచూల ఉన్నవారికి ఉచితంగా ఆపరేషన్ చేసి మందులు అందజేస్తారని తెలిపారు. మండలంలోని అన్ని పాఠశాలలో ప్రశస్త యాప్ ద్వారా ప్రతి పిల్లవాడిని పరీక్ష చేయించాలని ఐఈఆర్పీలకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ హెచ్ బల్లికురవ హెచ్‌ఎం నాగజ్యోతి, ఐఈఆర్టీ నాగబాబు పాల్గొన్నారు.

పౌష్టికాహారం పంపిణీ

అద్దంకి రూరల్: పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా గురువారం మండలంలోని శంఖవరప్పాడు గ్రామంలో సూపర్‌వైజర్ ఇందిరమ్మ ఆధ్వర్యంలో గర్భిణులకు, బాలింతలకు పౌష్టికాహారం అందజేశారు. అనంతరం పోషకాహారం తీసుకోటంవల్ల కలిగే ప్రయోజనాలు వివరించారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం, ఆశలు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

షాక్ కొడతాయి.. జాగ్రత్త !

- విద్యుదాఘాతాలపై అప్రమత్తత అవసరం
- వర్షాకాలంలో జాగ్రత్తలు తప్పనిసరి
- కొద్దిపాటి నిర్లక్ష్యం.. ప్రాణాలకే ప్రమాదం

వేటపాలెం: వర్షాకాలం వచ్చిందంటే చాలు ఎన్నో సమస్యలు చుట్టుముడతాయి. ఒక పక్క సీజనల్ వ్యాధులు మరో పక్క కరెంట్ షాక్ సమస్యలు వస్తుంటాయి. ఏమాత్రం అప్రమత్తంగా ఉన్నామంటే చాలు ప్రాణాల మీదకు తెచ్చుకోవాల్సిందే. ఇళ్లల్లో, పొలాల్లో కరెంటు తీగలను జాగ్రత్తగా గమనిస్తూ పనిచేసుకోవాలి. వర్షాకాలం సీజన్‌లో తుఫానులు, ఈదురు గాలులు వీస్తుంటాయి. వీటి వల్ల విద్యుత్ ప్రమాదాలకు ఆస్కారం ఉండే అవకాశాలు ఎక్కువ. వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యే రైతులు విద్యుత్ మోటార్ల వద్ద అప్రమత్తంగా ఉండాలి. వర్షాకాలంలో మరింత జాగ్రత్తగా మెలగడం ద్వారా ప్రాణాలు కాపాడుకోవచ్చని విద్యుత్ శాఖ అధికారులు పేర్కొంటున్నారు. విద్యుదాఘాతాలు వర్షాకాలంలోనే ఎక్కువ. వేసవిలో వేగంగా గాలి రావడం వల్ల విద్యుత్ వైర్లు తెగి ఉండడం, బాగా కిందకు వేలాడడం వంటివి చోటుచేసుకుంటాయి. ఇళ్ల వద్ద దుస్తులు ఆరేసుకోవడానికి ఉపయోగించే ఇనుపతీగలు సర్వీసు వైర్లకు ఆనుకొని ఉండటంతో ప్రమదాలు ఇంటిమీదే ఉన్నట్టుంటాయి. ఆ తీగ ద్వారా విద్యుత్ ప్రసరించే అవకాశం ఉండటంతో బట్టలు ఆరేయడానికి వచ్చినప్పుడు విద్యుదాఘాతానికి గురయ్యే అవకాశం చాలా ఎక్కువ. వీటన్నింటితో పాటు వర్షా కాలంలో విద్యుత్ తీగల కింద ఉన్న చెట్లకొమ్మలు ఏపుగా పెరిగిఉంటాయి. వాటిని గమనించకుండా కొమ్మలు నరకడానికి



విద్యుత్ ట్రాన్స్‌ఫారం వద్ద ఫ్యూజు వేస్తున్న లైన్‌మెన్

చెట్లు ఎక్కడం వల్ల విద్యుదాఘాతానికి గురైయ్యే ఆస్కారముంది.

అవగాహన లేకుండా ఫ్యూజ్ వేయొద్దు..

గ్రామాల్లో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఫ్యూజ్‌లు పోతే లైన్‌మెన్ గాని, అసిస్టెంట్ లైన్‌మెన్ గాని వచ్చేవరకు రైతులు, విద్యుత్ వినియోగదారులు వేచిచూడాలి. కాని చాలా మంది రైతులు అలా ఉండటం లేదు. ప్రైవేటు ఎలక్ట్రీషియన్‌ను పిలవడమో, లేక తామే ఫ్యూజ్ వేయడమో చేస్తూ ప్రమాదాల బారిన పడుతున్నారు. అలా చేయకుండా కచ్చితంగా విద్యుత్ సిబ్బందికి సమాచారం అందజేయాలి. ఇంటి వద్ద ఉంచే విద్యుత్ మీటర్ల వద్ద గానీ, వ్యవసాయ భూముల్లోని స్టార్టర్‌గానీ, వ్యవసాయ భూముల్లోని బాక్సులు వద్ద గాని ఎర్త్ వైర్లు సరిగా ఉన్నాయో లేదో చూసుకోవాలి. విద్యుత్ తీగలు తెగి బాక్సుపైన పడినా, వర్షం వల్ల బాక్సులు, వైర్లు తడిచినా భూమికి కరెంటు చేరి ఫ్యూజు పోగొట్టి జరిగే ప్రమాదాన్ని ఎర్త్ వైరు కాపాడుతుంది. కాబట్టి ఎర్త్ వైర్లను తప్పనిసరిగా చూసుకోవాలి.

35 అడుగుల దూరంలో ఉండాలి..

వర్షాకాలంలో వచ్చే ఈదురుగాలులు, పెనుగాలులకు ఊరి బయట పొలాల్లో ఉండే విద్యుత్ తీగలు తెగిపడతాయి. వాటిని పునరుద్ధరించకపోతే వాటి వల్ల ప్రమాదాలకు ఆస్కారముంటుంది. పొలాల్లో స్టార్టర్ వద్ద నుంచి బోరు వరకుండే వైర్లను నేలపై ఉంచుతారు. దీనివల్ల వైర్లు నేల రాపిడికి గురై పైన ఉండే ఇన్సులేషన్ పోతుంది. వర్షం వచ్చే సమయంలో ఇనుప విద్యుత్ స్తంభాలను అసలు పట్టుకోకూడదు. కిందపడి ఉన్న విద్యుత్ తీగలకు వర్షాకాలంలో కనీసం 35 అడుగుల దూరంలో ఉండాలి.

ప్లాస్టిక్ బాక్స్‌లు ఉపయోగించాలి..

వ్యవసాయ విద్యుత్ కనెక్షన్‌లకు సంబంధించి గతంలో రైతులు స్టార్టర్ బాక్సుకు ఇనుప బాక్సులు ఉపయోగించేవారు. విద్యుత్ తీగలు తెగి అవి ఇనుప బాక్సుకు ఆనుకుంటాయి. దీంతో బాక్సును తాకగానే రైతులు విద్యుత్ షాక్‌కు గురై ప్రాణాలు కోల్పోయే అవకాశం ఉంటుంది. ఈ నేపథ్యంలో తక్కువ ధరకు అందుబాటులోకి వస్తున్న ప్లాస్టిక్ బాక్సులను ఏర్పాటు చేసుకుంటే ప్రమాదాలకు అవకాశం ఉండదు.

వర్షాకాలం జాగ్రత్తగా ఉండాలి..

వర్షాకాలంలో రైతులు, విద్యుత్ వినియోగదారులు జాగ్రత్తగా ఉండాలి. కిందపడి ఉన్న విద్యుత్ తీగలకు దూరంగా ఉండాలి. ఎర్త్‌లు సరిగా ఉన్నాయో లేదో చూసుకోవాలి. విద్యుత్ ఉపకరణాలను తాకేటప్పుడు తప్పనిసరిగా రబ్బరు గ్లౌజులు వాడటం మేలు.

– భాస్కరరావు, విద్యుత్‌శాఖ ఏఈ రూరల్, వేటపాలెం

ఎయిడ్స్ ప్రాణాంతకమైన వ్యాధి



పర్చూరులో ర్యాలీ నిర్వహిస్తున్న మహిళా మండలి సభ్యులు, సిబ్బంది



అద్దంకిలో ఎస్సైతో ఎయిడ్స్ నియంత్రణ మండలి సభ్యులు

పర్చూరు (చినగంజాం): ఎయిడ్స్ ప్రాణాంతకమైన వ్యాధి అని బీఏఆర్ అండ్ టీఏ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్ శేషుకుమారి పేర్కొన్నారు. గురువారం స్థానిక బీఏఆర్ అండ్ టీఏ కళాశాలలో చీరాల మహిళా మండలి ఆధ్వర్యంలో విద్యార్థులకు ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. నేటి బాలలే రేపటి పౌరులు, నేటి పౌరులే రేపటి దేశ పునాదులు అనే లక్ష్యంతో పర్చూరు బీఏఆర్ అండ్ టీఏ గవర్నమెంట్ జూనియర్ కాలేజీలో చీరాల మహిళా మండలి టీఐ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఆర్ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో ఔట్ రీచ్ వర్కర్‌లు మీకు తెలుసా హెచ్‌ఐవీ ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. చీకటి దారుల్లో ముసుగు కప్పుకొని యువతను మాయచేస్తున్న చెడు స్నేహితులు మీకు తెలియకుండానే డ్రగ్స్ మత్తు పానీయాలకు అలవాటు చేసే హెచ్‌ఐవీ ఎయిడ్స్‌కి గురయ్యేలా చేస్తున్నారు జాగ్రత్తగా ఉండాలని పర్చూరు హెల్త్ సెంటర్ ఎల్టీ ఎస్‌కే షంషీర్ తెలియజేశారు. ప్రపంచ వ్యాప్తంగా 38 మిలియన్‌ల మంది హెచ్‌ఐవీ, ఎయిడ్స్‌తో జీవిస్తున్నారని వీరిలో 23 లక్షల మంది దేశంలోను అందులో సుమారు 4 లక్షల మంది ఆంధ్రప్రదేశ్ ఉన్నారన్నారు. దీని నివారణ కోసం ఎన్ఏసీఓ, ఏపీఎస్ఏసీఎస్ హెచ్‌ఐవీ ఎయిడ్స్ పట్ల ఒక ఉద్యమంలా క్యాంపులు, ర్యాలీలు, డోర్ టూ డోర్ కార్యక్రమాలు చేయడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమానికి కళాశాల సిబ్బంది, విద్యార్థులు, చీరాల మహిళా మండలి సిబ్బంది పాల్గొన్నారు.

అద్దంకి రూరల్: ఎయిడ్స్ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అద్దంకి ఎస్సై ఖాదర్ బాషా అన్నారు. గురువారం హెల్ప్ స్వచ్ఛంద సంస్థ, బాపట్ల జిల్లా హెఐవీ నియంత్రణ సంస్థ ప్రతినిధులు ఎస్సైని కలిశారు. ఈ సందర్భంగా టోల్ ఫ్రీ నంబర్ 1097 పట్ల స్టేషన్‌కు వచ్చే ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. కార్యక్రమంలో పార్వతి, శివపార్వతి, మల్లేశ్వరీ పాల్గొన్నారు.

సీతారాం ఏచూరి మరణం పార్టీకి తీరని లోటు

పర్చూరు (చినగంజాం): సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మృతి పట్ల పలువురు కమ్యూనిస్టు నేతలు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని దేవుడుని ప్రార్థించారు. ఏచూరి విద్యార్థి దశ నుంచే అనేక ఉద్యమాల్లో పాల్గొన్నట్లు పర్చూరు మాజీ ఏఎంసీ చైర్మన్ నరిశెట్టి ఆచార్యులు అన్నారు. దేశంలో అత్యవసర పరిస్థితిని విధించినప్పుడు జైలు జీవితం గడిపిన వారిలో ఆయన కూడా ఒకరని తెలిపారు. హక్కుల కోసం జరిగిన పోరాటాల్లో పేదల పక్షాన నిలబడిన వ్యక్తి ఏచూరి అని కొనియాడారు. ఏచూరికి నివాళులర్పించిన వారిలో సీపీఎం నాయకులు జీ ప్రతాప్, బండి శంకరయ్య, ప్రభుదాసు, బండారు చిన్న దాసు, కే శ్రీనివాసరావు, మత్తె డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

చీరాల: సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శిగా పనిచేస్తు పలు ఉద్యమాల్లో కీలకంగా వ్యవహరించి ప్రజల గొంతుకగా పేరొందిన కామ్రేడ్ సీతారాం ఏచూరి (77) మరణం సీపీఎం పార్టీకి, పేదలకు తీరని లోటని సీపీఎం నాయకులు పేర్కొన్నారు.



సీతారాం ఏచూరి చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న సీపీఎం నాయకులు

అనారోగ్యంతో బాధపడుతూ గురువారం ఢిల్లీలోని ఎయిమ్స్‌లో మృతి చెందిన ఏచూరి చిత్రపటానికి చీరాల సీపీఎం నాయకులు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో ఏచూరి సంతాప సభను నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఎన్.బాబూరావు, పి.కొండయ్య, వసంతరావు, సుబ్బారావు, శ్రీను, కెబీకే రెడ్డి, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.



అద్దంకిలో సుందరయ్య భవన్‌లో ఏచూరికి నివాళులర్పిస్తున్న పార్టీ నాయకులు

అద్దంకి: సీతారాం ఏచూరి పార్టీకి చేసిన సేవలు మరువలేనివని అద్దంకి సీపీఎం నాయకులు పేర్కొన్నారు. అద్దంకి సుందరయ్య భవనంలో పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో సంతాపం తెలియజేశారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి తంగరాల వెంకటేశ్వర్లు, కె రఘుచంద్, మన్యం త్రిమూర్తులు నాయకులు పనక రామాంజనేయులు, బి విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పురస్కారాల కరపత్రం ఆవిష్కరణ

చినగంజాం: పేద నాయీ బ్రాహ్మణ విద్యార్థుల ప్రతిభా పురస్కారాలకు సంబంధించి కరపత్రాలను గురువారం చినగంజాంలో ఆవిష్కరించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నాయీ బ్రాహ్మణ ఉద్యోగుల సాంస్కృతిక సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో అక్టోబరు 6వ తేదీ ఒంగోలు కాపు కళ్యాణ మండపంలో నిర్వహించు పేద నాయీ బ్రాహ్మణ విద్యార్థులకు ప్రతిభ పురస్కారాల అందజేత కార్యక్రమం ఉంటుందన్నారు. కరపత్రాలను స్థానిక భావన్నారాయణ స్వామి కళ్యాణ మండపంలో చినగంజాం నాయీ బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు కొండపాటూరి వెంకటేష్ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈకార్యక్రమంలో ప్రకాశం జిల్లా నాయీ బ్రాహ్మణ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు పతకమూరి మధుబాబు, జిల్లా ట్రెజరర్ పాతపాటి మధుబాబు, రాష్ట్ర ఉపాధ్యక్షులు మార్కాపురం వెంకట రామారావు, సంయుక్త కార్యదర్శి నాదెండ్ల రాఘవ, ఆంధ్రప్రదేశ్ వాయిద్య కళాకారుల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు మాచవరపు రామాంజనేయులు, పర్చూరు నియోజకవర్గ నాయీ బ్రాహ్మణ సంఘం కన్వీనర్ మాచవరపు నటరాజ్, గ్రామ ప్రధాన కార్యదర్శి మాచవరపు బాలసుబ్రహ్మణ్యం, ఉపాధ్యక్షుడు మాచవరపు సాంబశివరావు, రాకేష్ తదితర నాయీ బ్రాహ్మణులు పాల్గొన్నారు.



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయీ బ్రాహ్మణుల సంఘ ప్రతినిధులు

కౌలు రైతుల సమస్యలు పరిష్కరించాలి

జే.పంగులూరు: వ్యవసాయంలో రైతులు, కౌలు రైతులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ రైతు సంఘం ఆధ్వర్యంలో గురువారం మండలంలోని అలవలపాడు, బైటమంజులూరు గ్రామాల్లో రైతులు ఆందోళన చేశారు. ఈమేరకు ఆయా సచివాలయాల్లో సెక్రటరీలకు వినతి పత్రాలను అందజేశారు. ఈసందర్భంగా అలవలపాడులో జరిగిన కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి తలపనేని రామారావు మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ ప్రారంభం అయ్యి మూడు నెలలు గడిచి పోయిందని, వ్యవసాయానికి పెట్టుబడుల కోసం బ్యాంకులు, ఇతర వడ్డీ వ్యాపారుల చుట్టు రైతులు కౌలు రైతులు తిరగాల్సి వస్తుందన్నారు. ఈ పరిస్థితుల్లో ఎన్నికల హామీగా ప్రకటించిన అన్నదాత సుఖీభవ పథకం కింద రూ. 20 వేలు ప్రభుత్వ పెట్టుబడి సహాయం కింద రైతులు అందజేయాలని, రైతులకు ఇది ఎంతో ఉపయోగపడుతుందన్నారు. రీ సర్వే జరిగిన గ్రామాల్లో పెండింగ్ ఉన్న పాస్ పుస్తకాలు 1-బీ, అడంగల్ రానందువల్ల రైతులు బ్యాంకు రుణాలకు అనర్హులవుతున్నారని తెలిపారు. గత 15 నుంచి 20 ఏళ్ల నుంచి తీవ్ర ఇబ్బందులతో సాగుతుందన్నారు. వ్యవసాయ మోటార్లకు స్మార్ట్ మీటర్లు పెట్టే జీవో నెంబర్ 22న తక్షణమే రద్దు చేయాలని కోరారు. ఈమేరకు సచివాలయ కార్యదర్శులకు వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో సరికొండ రామచంద్రరాజు, పూసపాటి సుబ్బరాజు, కృష్ణంరాజు, గరికపాటి శంకర్ బాబు, గొట్టిపాటి నాగేశ్వరరావు, గరికపాటి సాగర్, లోకి రెడ్డి చెన్నారెడ్డి, కోమటి పున్నారావు, గొట్టిపాటి వెంకటసుబ్బారావు పాల్గొన్నారు.



సెక్రటరీకి వినతి పత్రం అందజేస్తున్న రైతులు

కొనసాగుతున్న వినాయక నిమజ్జనాలు



ట్రాక్టర్లలో నిమజ్జనానికి తరలుతున్న గణనాథుడు



మార్టూరులో వినాయక నిమజ్జనం కార్యక్రమంలో పాల్గొన్న ఆర్యవైశ్య మహిళలు

చీరాల టౌన్: వినాయక చవితి చలువ పందిళ్లల్లో కొలువు దీరిన గణనాథులు ప్రత్యేక పూజలందుకుని తల్లి గంగఒడిలోకి చేరుతున్నారు. ఆరు రోజులుగా ప్రత్యేక పూజలు, భజనలు, వివిధ రకాల ఫలహారాలు అందుకున్న విఘ్నేశ్వరుడికు నీరాజనాలు పలుకుతూ వీడ్కోలు పలుకుతున్నారు. గురువారం చీరాల నియోజకవర్గంలోని వివిధ గ్రామాలు, మున్సిపాలిటీలోని వార్డుల్లో ఏర్పాటు చేసిన గణనాథులను వాడరేవు సముద్ర తీరంలో నిమజ్జనం చేస్తున్నారు.

మార్టూరు: వినాయక చవితి సందర్భంగా మండలంలోని పలు గ్రామాలలో గురువారం వినాయక నిమజ్జన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. మార్టూరు బొడ్డురాయి సెంటర్లోని వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాన్ని ఆర్యవైశ్య మహిళలు కోలాటం మధ్య గ్రామంలో ఊరేగింపు నిర్వహించి బొల్లాపల్లి సాగర్ కాలంలో నిమజ్జనం చేశారు.

పార్టీ నాయకుడికి పరామర్శ



హనుమంతురావును పరామర్శిస్తున్న వెంకాయమ్మ, కరణం, చిన హనిమిరెడ్డి

అద్దంకి రూరల్: జిల్లా వైఎస్సార్ సీపీ ఉపాధ్యక్షుడు జ్యోతి హనుమంతరావు సతీమణి జ్యోతి ఎమేల్యమ్మ ఇటీవల మరణించారు. గురువారం ఆమె పెద్దకర్మకు ఉమ్మడి ప్రకాశం జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, మాజీ ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి, అద్దంకి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి పానెం చిన హనిమిరెడ్డి పాల్గొని పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం హనుమంతురావును పరామర్శించారు. కార్యక్రమంలో కార్యకర్తలు పాల్గొన్నారు.

వరద బాధితులకు అండగా చెక్కుల అందజేత

జే.పంగులూరు: విజయవాడ వరద బాధితులను ఆదుకోవడానికి పంగులూరు మండల వీఓఏలు, సిబ్బంది అందరూ కలిసి విరాళం వసూలు చేశారు. ఈ చేసిన డబ్బులను డీడీ రూపంలో గురువారం చందలూరులో విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్‌కు ఏపీఎం ప్రసాద్‌బాబు ఆధ్వర్యంలో వీవో ఏలు, సిబ్బంది రూ. 1,01,116 డీడీని అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు అండగా రోటరీ..

అద్దంకి: బాధితులకు అండగా రోటరీ క్లబ్ ఉంటుందని క్లబ్ అధ్యక్షుడు వీరయ్య అన్నారు. కోలుకోలేని పరిస్థితుల్లో ఉన్న కొల్లూరు ప్రాంతానికి చెందిన



చందలూరులో మంత్రి గొట్టిపాటికి డీడీ అందజేస్తున్న వెలుగు సిబ్బంది

ప్రజలకు గురువారం నిత్యావసర వస్తువుల సరుకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీనియర్ రొటేరియన్ కాకర్ల వెంకటేశ్వర్లు, సభ్యులు ఉన్నారు.

కషాయంతో చీడపీడల నివారణ

బల్లికురవ (అద్దంకి రూరల్): కషాయాల ద్వారా పంటకు ఆశించిన చీడపీడలను నివారించుకోవచ్చని ప్రాజెక్టు మేనేజర్ వరగాని వాణిశ్రీ అన్నారు. గురువారం మండలంలోని కొణిదెన యూనిట్ నక్కబొక్కలపాడులో ప్రకృతి వ్యవసాయం రైతులకు కషాయాల తయారీపై అవగాహన కల్పించారు. ఆవుపేడ, ఆవు మూత్రం, 10 రకాల ఆకులతో దశపర్ణీ కషాయం తయారు చేశారు. అదే విధంగా నీమాస్త్రం, ద్రవజీవామృతం, బీజామృతం తయారు చేశారు. కార్యక్రమంలో డీఎస్‌ఎంపీ మోహన్, ఎన్‌ఎఫ్‌ఏ చందన దుర్గా, ఎంటీ వెంకటేశ్వర్లు యూనిట్ ఇన్‌చార్జి పాల్గొన్నారు.

బస్సులు ప్రారంభించిన మంత్రి



రిబ్బన్ కట్‌చేసి బస్సును ప్రారంభిస్తున్న మంత్రి

అద్దంకి రూరల్: అద్దంకి టు హైదరాబాద్‌కు రెండు కొత్త సూపర్ లగ్జరీ బస్సులను గురువారం అద్దంకి ఆర్టీసీ డిపోలో విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆర్టీసీ బలోపేతానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. అద్దంకి ప్రయాణికుల సౌకర్యార్థం మరో రెండు బస్సులు ప్రారంభించినట్లు తెలిపారు. అనంతరం డిపో ఆవరణలో మొక్క నాటారు. ఈ కార్యక్రమంలో డీఎం రామ్మోహనరావు, సిబ్బంది పాల్గొన్నారు.

డివైడర్‌ను ఢీకొన్న కారు

మేదరమెట్ల: కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టడంతో భర్తకు గాయాలయ్యాయి. ఈఘటన కొరిశపాడు మండలంలోని మేదరమేట్ల ఫ్లై ఓవర్ వద్ద గురువారం జరిగింది. అందిన వివరాల మేరకు.. సూళ్లూరుపేటకు చెందిన మారెం వీరరాఘవులు అతని భార్యతో కలిసి కారులో గుంటూరుకు బయలుదేరారు. ఈక్రమంలో మేదరమేట్ల ఫ్లైఓవర్ బ్రిడ్జి ఎక్కే సమయంలో కారు అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో వీరరాఘవులుకు గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని 108 వాహనంలో ఒంగోలు రిమ్స్ వైద్యశాలకు తరలించినట్లు మేదరమెట్ల పోలీసులు తెలిపారు.

రోటరీ ఆధ్వర్యంలో రక్తదానం

అద్దంకి రూరల్: రక్తదానం ప్రాణదానంతో సమానమని రోటరీ క్లబ్ సభ్యులు పేర్కొన్నారు. అద్దంకికి చెందిన ఒబ్బినీడి వెంకాయమ్మ, చాటకొండ మధుసూదనరావులకు డాక్టర్ సూచన మేరకు రక్తం ఎక్కించాల్సి ఉండగా వారి బంధువులు రోటరీక్లబ్ సెక్రటరీ, రక్తదాన ప్రోత్సాహకుడు చుండూరు మురళీ సుధాకరరావును సంప్రదించారు. పట్టణానికి చెందిన టైలర్ గోరంట్ల అచ్చయ్య, డ్రైఫ్రూట్స్ వ్యాపారి దివ్వెల వీర వెంకట సత్యానారాయణలు రక్తదానం చేశారు. ఈసందర్భంగా రక్తదాతలను, ప్రోత్సహకుడిని క్లబ్ సభ్యులు అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్ చప్పిడి వీరయ్య, ట్రెజరర్ మలాది శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మెనూ కచ్చితంగా అమలు చేయాలి

కారంచేడు: ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా అందించే మధ్యాహ్న భోజన పథకంలో ప్రభుత్వం నిర్ణయించిన ప్రకారం మెనూను కచ్చితంగా అమలు చేయాలని ఎంఈఓ మొలబంటి వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం ఆయన మండలంలోని కారంచేడు, స్వర్ణ ఉన్నత పాఠశాలల్లోని అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు మంచి పోషక విలువలు కలిగిన ఆహారంను మెనూలో చేర్చారన్నారు. ఈ మెనూ అమలు చేయడంలో కుకింగ్ నిర్వాహకులు ఎక్కడా నిర్లక్ష్యంగా ఉండవద్దన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఎంవీ సుబ్బారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఎండీఎంను రుచి చూస్తున్న ఎంఈఓ, హెచ్‌ఎంలు